క్లుప్తంగా

అనిల్ ఎంతో మేలు చేశారు

• మాజీ డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్



నెల్లూరు(బారకాసు): 'మాజీ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ నాకు ఎంతో మేలు చేశారు. ఆయన చేసిన మేలును ఎన్నటికీ మర్చిపోలేను' అని మాజీ డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనిల్ తనను నమ్మించి గొంతుని కోశారని రూప్‌కుమార్ యాదవ్ చేసిన ఆరోపణలపై ఖలీల్ సోమవారం స్పందించారు. ఆ వ్యాఖ్యలను కొట్టిపారేశారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు సిటీ చూసుకుంటావా అనడిగారని, అయితే ఆరోగ్యం బాగోలేదని చెప్పి నా అంతట నేనే తప్పుకున్నానని చెప్పారు. రెండుసార్లు కార్పొరేటర్‌గా, డిప్యూటీ మేయర్‌గానూ, పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఉన్నత స్థానానికి వెళ్లానంటే దానికి వైఎస్ జగన్ ఆశీస్సులు, అనిల్ ప్రోత్సాహం కారణమని వెల్లడించారు.

పేదలకు అన్నదానం



నెల్లూరు(బృందావనం): సింహపురి అర్చక, పురోహిత సంఘం ఆధ్వర్యంలో వివిధ బ్రాహ్మణ సంఘాల సహకారంతో సోమవారం నగరంలోని స్టోన్‌హౌస్‌పేట ఫ్లై ఓవర్ వద్ద అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకుడు పారా శ్రీధర్‌శర్మ, శ్రీరామాయణం మహేష్‌స్వామి, శ్రీరామాయణం మణి, గుండాపంతుల సుబ్రహ్మణ్యం, బాలు, రామనాథం, రాజు, కిరణ్,విష్ణు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు

నెల్లూరు(బారకాసు): స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా నాటుతున్న మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకున్నామని, ట్రీ గార్డులను ఏర్పాటు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ తెలిపారు. 20వ డివిజన్ ఇందిరానగర్, కావేరి అవెన్యూ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ట్రీ గార్డులను కమిషనర్ సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ చంద్రయ్య, ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

డీకేడబ్ల్యూలో కోర్సు ప్రారంభం

నెల్లూరు(టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో జంతు శాస్త్రం, ఆక్వా కల్చర్ డిపార్ట్‌మెంట్లు సంయుక్తంగా ష్రింప్ ప్రాసెసింగ్ టెక్నాలజీ సర్టిఫికెట్ కోర్సును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గిరి మాట్లాడుతూ ఆక్వా రంగంలో మహిళలకు అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కోర్సులో ఇంటర్ పాసైన మహిళలు చేరవచ్చన్నారు. ఆసక్తి గల వారు కో-ఆర్డినేటర్ రంజని ఫోన్ నంబర్ 94913 21150కు కాల్ చేయాలని సూచించారు.

సీఐటీయూ కార్యాలయంలో సదస్సు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): శ్రామిక మహిళా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో సదస్సు ఏర్పాటు చేశారు. ఇందులో డీకేడబ్ల్యూ కాలేజీ పూర్వ లెక్చరర్ భారతి మాట్లాడారు. మహిళా ఉద్యోగులపై జరుగుతున్న లైంగిక వేధింపులను అరికట్టేలా చట్టాలను అమలు చేయాలన్నారు. కమిటీ జిల్లా కన్వీనర్ దుగ్గిరాల అన్నపూర్ణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తాన్‌బీ పాల్గొన్నారు.

పాఠశాలలో సమావేశం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని గిరిజన బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో సోమవారం సామాజిక సమరతా వేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం అధికారి మహేందర్‌రెడ్డి, వేదిక జిల్లా కార్యదర్శి గోళ్ల కేశవులు మాట్లాడారు. ప్రిన్సిపల్ విజయలక్ష్మి, జయప్రకాష్, రాజేంద్ర, రసూల్, మేఘన, మంజుల, నవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నెల్లూరు(అర్బన్): కేన్సర్ పట్ల ప్రజలు అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని జీజీహెచ్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కామేశ్వరి తెలిపారు. ఆ కళాశాలకు చెందిన నర్సింగ్ విద్యార్థినులతో కూడిన ఎన్ఎస్ఎస్ టీమ్ సోమవారం స్థానిక మెడికవర్ ఆస్పత్రికి సమీపంలో ఉన్న రామాలయం వీధి డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ అనంతరం సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ ప్రసూనకుమారి, సైకాలజిస్ట్ డాక్టర్ నళిని, హార్ట్ ఫుల్ సెంట్రల్ యోగా మెడిటేషన్ గురువు ప్రవీణలత పాల్గొన్నారు.

దౌర్జన్యం చేశాడని ఫిర్యాదు

నెల్లూరు సిటీ: అల్లుడు దౌర్జన్యం చేశాడంటూ ఓ వ్యక్తి సోమవారం సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారి కథనం మేరకు.. జనార్దనరెడ్డికాలనీలో సయ్యద్ మీరా మొహిద్దీన్ ఉంటున్నాడు. తన కుమార్తెను పద్మావతి సెంటర్‌కు చెందిన సయ్యద్ షకీల్‌కు ఇచ్చి వివాహం చేశాడు. షకల్ రెండో పెళ్లి చేసుకున్నాడని తెలుసుకుని మీరా మొహిద్దీన్ వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో రెండు నెలల క్రితం ఫిర్యాదు చేశాడు. పెద్దల జోక్యంతో కుమార్తెను తిరిగి కాపురానికి పంపాడు. కాగా ఆమె పేరు మీద ఉన్న ఇంటిని తన పేరు మీద రాయాలని ఒత్తిడి తీసుకురావడంతో ఆమె తప్పించుకుని గిడ్డంగి వారి వీధిలోని మీరా ఫ్యాషన్ డిజైనర్ షాపులోకి వెళ్లింది. షకీల్ ఆ షాపులోకి ప్రవేశించి సీసీ కెమెరా, మగ్గం వర్క్‌ను ధ్వంసం చేశాడు. భార్యను, దుకాణంలోకి వర్కర్‌ను బెదిరించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విచారణ జరిపి పరిష్కరిస్తాం

• డీటీసీ డీఎస్పీ ఎం.గిరిధర్‌రావు
• ఎస్పీ కార్యాలయానికి 152 ఫిర్యాదులు



బాధితుల ఫిర్యాదులు నమోదు చేసుకుంటున్న పోలీసులు

నెల్లూరు సిటీ: 'మీ సమస్యలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పరిష్కరించి న్యాయం చేస్తాం' అని డీటీసీ డీఎస్పీ ఎం.గిరిధర్‌రావు తెలిపారు. సోమవారం పోలీస్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 152 మంది ఫిర్యాదులు అందజేశారు. ఎస్పీ ఆదేశాలతో గిరిధర్‌రావు ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని వినతులు ఇచ్చారు. అర్జీదారులకు ధైర్యం చెప్పి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- ఉదయగిరి జీ చెరువుపల్లికి చెందిన పెంచలరావుకు అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.1.50 లక్ష, అతని సోదరుడికి బ్యాంక్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.8.50 లక్షల నగదును తీసుకుని మోసం చేశాడని ఫిర్యాదు.
- వేదాయపాళేనికి చెందిన వ్యక్తిని చెన్నైకు చెందిన వెంకటనాథ్ అనే వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.5.50 లక్షల నగదు తీసుకుని మోసం చేశాడని, విచారించి న్యాయం చేయాలని కోరారు.
- కావలికి చెందిన మహిళను భర్త, అత్తమామలు అధిక కట్నం, బంగారం కోసం వేధిస్తున్నారని, న్యాయం చేయాలని వినతిపత్రం ఇచ్చారు.
- వేదాయపాళేనికి చెందిన మహిళను భర్త ఇంటి నుంచి గెంటేశాడని, కౌన్సెలింగ్ నిర్వహించి, కుటుంబాన్ని చక్కదిద్దాలని విన్నవించారు.
- అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరుకు చెందిన తన కుమార్తెను సైదాపురంలోని వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేయగా, కుమార్తెను హత్య చేశాడని, తన కుమార్తె మరణానికి కారణమైన భర్తతోపాటు మిగిలిన వారిని అరెస్ట్ చేసి, చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు అందింది.
- దగదర్తికి చెందిన తన తమ్ముడిని మారణాయుధాలతో హత్య చేశారని, తమకు రక్షణ కల్పించి, పూర్తి విచారణ చేసి ఇంకా మిగిలిన నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు.
- ముత్తుకూరుకు చెందిన ఎనిమిది మంది రైతుల వద్ద మనుబోలుకు చెందిన అశోక్ అనే వ్యక్తి రూ.76.64 లక్షల విలువైన ధాన్యం కొనుగోలు చేసి, రెండేళ్ల నగదు ఇవ్వడం లేదని, విచారించి న్యాయం చేయాలని కోరారు.
- కొండ్లపూడికి చెందిన వృద్ధురాలిని తన కొడుకులు బాగోగులు చూసుకోకుండా ఆస్తి కోసం వేధిస్తున్నారని, అల్లూరుకు చెందిన వృద్ధురాలిని ఇరుగుపొరుగు వారు తన రేకుల షెడ్ కూల్చేశారని, చంపుతామని బెదిస్తున్నారని విచారించి న్యాయం చేయాలని ఫిర్యాదులు అందాయి.

కాకాణికి అభినందనల వెల్లువ



కాకాణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నేతలు

నెల్లూరు(బారకాసు): వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులై నెల్లూరుకు విచ్చేసిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి పలువురు అభినందనలు తెలియజేశారు. సోమవారం నగరంలోని డైకస్ రోడ్డులో ఉన్న ఆయన నివాసంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

అర్జీలు పునరావృతం కాకూడదు

• అదనపు కమిషనర్ శర్మద



ప్రజలతో మాట్లాడుతున్న శర్మద

నెల్లూరు(బారకాసు): 'ప్రజల నుంచి అర్జీలు పునరావృతం కాకూడదు. వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి' అని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మద తెలిపారు. కమిషనర్ సూర్యతేజ ఆదేశాల మేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో శర్మద ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని అధికారులకు సూచించారు. మొత్తం 21 వినతులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి 5, ఇంజినీరింగ్ 4, ప్రజారోగ్యం 4, రెవెన్యూ 3, ఎస్టాబ్లిష్‌మెంట్ 1, హౌసింగ్ విభాగానికి సంబంధించి 4 అర్జీలు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ సంజయ్, మేనేజర్ ఇనాయతుల్లా, ఇతర విభాగాలధికారులు, సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దార్శనిక పత్రం ఆవిష్కరణ



పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న కలెక్టర్ తదితరులు

నెల్లూరు(దర్గామిట్ట): స్వర్ణాంధ్ర-2047కు సంబంధించి దార్శనిక పత్రం పేరుతో వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఒ.ఆనంద్ కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ అభివృద్ధి ప్రక్రియలో భాగస్వాములైతే సరైన ప్రణాళికల ద్వారా మెరుగైన సేవలందించే అవకాశం ఉంటుందన్నారు. పత్రంలో ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ప్రజలందరూ తమ ఆలోచనలను పంచుకుని సలహాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీఆర్వో లవన్న, సీపీఓ రాజు, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కులగణన చేపట్టాలని డిమాండ్



బుక్‌లెట్‌లను విడుదల చేసిన నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 'టీడీపీ ఎన్నికల ప్రచారంలో బీసీలకు స్థానిక సంస్థలు, చట్టసభల్లో, నామినేటెడ్ పోస్టుల్లో సింహ భాగం సీట్లు ఇస్తామని హామీ ఇచ్చింది. అందుకు అనుగుణంగా రాష్ట్రంలో కులగణన చేపట్టి బీసీలకు రాజకీయంగా రిజర్వేషన్లు కల్పించాలి' అని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి, రాష్ట్ర కో-ఆర్డినేటర్ రిటైర్డ్ డీజీపీ పూర్ణచంద్రరావులు డిమాండ్ చేశారు. నగరంలోని హరనాథపురంలో ఉన్న రాధే గెస్ట్ ఇన్‌లో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బీసీ గణన చేసేందుకు నిధులు అవసరం లేదని, తెలంగాణలో గతంలో కేసీఆర్ ఒక్కరోజులో కులగణన చేయించాడని గుర్తుచేశారు. కులగణన చేయాలంటూ వచ్చే నెల 9వ తేదీన విజయవాడలో చేపడుతున్న ధర్నాకు బీసీ, బీఎస్పీ నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. టీడీపీ పట్టించుకోకపోతే రానున్న స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి గుణపాఠం చెబుతామన్నారు. అనంతరం కరపత్రాలు, బుక్‌లెట్‌లను విడుదల చేశారు.

ఎమ్మెల్సీని కలిసిన నాయకులు



ఎమ్మెల్సీతో మాట్లాడుతున్న ధనుజ

నెల్లూరు(బారకాసు): వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని సోమవారం నగరంలోని ఆయన నివాసంలో పలువురు నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఈదల ధనుజ, ముత్యాలరెడ్డి, బట్టేపాటి నరేంద్రరెడ్డి, షబ్బీర్, 13వ డివిజన్ కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, 9వ డివిజన్ నాయకులు వెంకటరెడ్డి, పిచ్చిరెడ్డి, విద్యార్థి విభాగం నగరాధ్యక్షుడు శేషసాయి, 53వ డివిజన్ నాయకులు ఎమ్మెల్సీని కలిసిన వారిలో ఉన్నారు.

ముగిసిన చెస్ టోర్నమెంట్

• విజేతగా నిలిచిన ఫిడే చెస్ మాస్టర్ ఆదిత్య వరుణ్



విజేతకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో మైపాడురోడ్డులో కేపీఆర్ కల్యాణ మండపంలో మూడు రోజులుగా జరుగుతున్న వైవీ రమణారెడ్డి స్మారక తృతీయ ఆలిండియా ఓపెన్ చెస్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. జాతీయ స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో విజేతగా ఫిడే చెస్ మాస్టర్ ఆదిత్య వరుణ్ (విశాఖపట్నం), ద్వితీయ, తృతీయ స్థానాల్లో భరత్‌కుమార్‌రెడ్డి (హైదరాబాద్), ఇంటర్నేషనల్ చెస్ మాస్టర్ హరిమాధవన్ (చెన్నై) నిలిచారు. విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలు, సైకిల్స్, స్మార్ట్ వాచ్‌లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌బీ హోమ్స్ చైర్మన్ సుప్పనాచారి, తిరుపతి నగరపాలక సంస్థ కార్పొరేటర్ శేఖర్‌రెడ్డి, చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వై.సుమన్, టోర్నీ నిర్వాహకులు వెంకటేష్, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, వినయ్, హైకోర్టు లాయర్ శ్రీహరి, టోర్నీ ఆర్బిటర్స్ గోపినాథ్, ప్రదీప్, రామ్, వంశీ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తండ్రి మరణంపై కుమారుడి ఫిర్యాదు

నెల్లూరు సిటీ: 'నా తండ్రి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. దీనిపై విచారణ జరిపాలి' అని నెల్లూరు నవాబుపేట పోలీసులకు ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం మేరకు.. బంగ్లాతోటకు చెందిన పి.మల్లికార్జున (46) మద్యానికి బానిసయ్యాడు. రోజూ తాగుతూ ఇంటికి వెళ్లడం లేదు. శ్రీనివాసనగర్‌లోని 6వ వీధిలో తన మెకానిక్ దుకాణంలోనే నిద్రిస్తున్నాడు. సోమవారం ఉదయం దుకాణంలో మల్లికార్జున చనిపోయి ఉన్నాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మల్లికార్జున కంటి వద్ద రక్త గాయాలుండడాన్ని గమనించారు. దీంతో కుమారుడు శివతేజ తండ్రి మృతిపై అనుమానాలున్నాయని, విచారణ జరిపాలని పోలీసులను కోరగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అభివృద్ధి చేస్తా : నారాయణ

నెల్లూరు సిటీ: 'కొంతమంది నన్ను రెచ్చగొట్టాలని చూస్తున్నారు. వారి మాటలకు నేను రెచ్చిపోను. నగరాన్ని అభివృద్ధి చేస్తా' అని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని 52వ డివిజన్‌లో సోమవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. నారాయణ మాట్లాడుతూ చట్టపరంగా ఎలాంటి సంస్థలు, ఇన్‌స్టిట్యూట్‌లైనా నడుపుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

'ఎవరికీ నగదు ఇవ్వలేదు'

నెల్లూరు(బారకాసు): డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ మాజీ మంత్రి అనిల్‌పై చేసిన ఆరోపణలపై సంత నిర్వాహకుడు మద్దూరు సుబ్బారావు సోమవారం స్పందించారు. 33 ఏళ్లుగా సంత నడుపుతున్నామని, తమను ఏ రాజకీయ నాయకుడు ఇప్పటి వరకు ఒక్క రూపాయి అడగలేదన్నారు. తాము ఎవరికీ నగదు ఇవ్వలేదన్నారు. సంతకు అనిల్‌కు ఎటువంటి సంబంధం లేదని, ఆయన మా వద్ద నుంచి నగదు తీసుకున్నారని రూప్‌కుమార్ చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలియజేశారు.

విజయ డెయిరీ డైరెక్టర్ పోస్టులకు నామినేషన్లు

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరులోని విజయ డెయిరీలో మూడు డైరెక్టర్ పోస్టులకు సోమవారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల అధికారి హరిబాబు పేర్కొన్నారు. అన్నం శ్రీహరి, కోట చంద్రశేఖర్ రెడ్డి, గంగా శ్రీనివాసులు, తాళ్లూరు బాబునాయుడు నామినేషన్లు వేశారు. మంగళవారం ఉపసంహరణ ప్రక్రియ ఉంటుందన్నారు.

వేగంగా గృహ నిర్మాణాలు

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని, వారానికి కనీసం 10 శాతం కచ్చితమైన పురోగతి సాధించాలని కలెక్టర్ ఒ.ఆనంద్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం వెబెక్స్ ద్వారా వివిధ అంశాలపై సబ్ కలెక్టర్లు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

బకాయిలను విడుదల చేయాలి

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ నాయకులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీఆర్వో లవన్నకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎం.సునీల్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో సదుపాయాలు కల్పించాలని, అవినీతికి పాల్పడుతున్న వార్డెన్లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్కే షారూక్, జిల్లా ఉపాధ్యక్షుడు పి.చరణ్, సభ్యులు హర్ష, పూజిత్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై స్పందనేదీ?

• ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు

నెల్లూరు(దర్గామిట్ట): 'కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైనా విద్యార్థుల సమస్యలు పరిష్కారం కాలేదు. కనీసం వాటిపై స్పందన కూడా లేదు' అని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వీఆర్సీ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. నిరసన తెలిపారు. అనంతరం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థులకు విద్యా, వసతి దీవెన పథకాల కింద రూ.3,480 కోట్ల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. హాస్టల్ చార్జీలను రూ.3 వేలకు పెంచాలన్నారు. వసతి గృహాలకు సొంత భవనాల ఏర్పాటుకు కృషి చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీఆర్ డిగ్రీ కళాశాలలో తిరిగి అడ్మిషన్లు జరపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు డి.చరణ్, సుమన్, ప్రశాంత్, జీవన్, విష్ణు, పవన్, శివ, యశ్వంత్, విక్రం, బాలాజీ, ఉమేష్ పాల్గొన్నారు.

వివిధ శాఖల్లో బదిలీలు



కోవూరు జనార్దనరెడ్డిని సన్మానిస్తున్న వెంకటసుబ్బయ్య



మధుసూదనరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యుత్ సిబ్బంది

నెల్లూరు(బృందావనం): జిల్లాలోని వివిధ ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న కార్యనిర్వహణాధికారులను బదిలీ చేస్తూ దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా అధికారి జంజనం శ్రీనివాసరావును మూలాపేటలోని రుక్మిణీసత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయానికి బదిలీ చేశారు. ఆయన ఇంకా సింహపురి గ్రామ దేవత ఇరుకళల పరమేశ్వరి, మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరాలయం దేవస్థానాల అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. ప్రకాశం జిల్లా దేవదాయ శాఖ అధికారిగా ఉన్న కోవూరు జనార్దనరెడ్డి నెల్లూరు జిల్లా అధికారిగా నియామకం చేశారు. అలాగే రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం అదనపు బాధ్యతలు అప్పగించగా బాధ్యతలు స్వీకరించారు. ఈ ఆలయ ఈఓగా ఉన్న జె.వెంకటసుబ్బయ్యను వైఎస్సార్ జిల్లా గండిక్షేత్రంలోని వీరాంజనేయ స్వామి దేవస్థాన ఈఓగా బదిలీ చేశారు. వేణుగోపాల స్వామి ఆలయ ఈఓ దాసరి చంద్రశేఖర్‌రావును కోటప్పకొండలోని త్రికోటేశ్వరస్వామి దేవస్థానం ఈఓగా బదిలీ చేశారు. వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఈఓగా, ఉప కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనృసింహా స్వామి దేవస్థానం ఉప కమిషనర్, ఈఓగా నియమితులయ్యారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కేవీ సాగర్‌బాబును మాలకొండలోని మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఈఓగా, ఉప కమిషనర్‌గా బదిలీ చేశారు.

నగరపాలక సంస్థలో..

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థలోని పలు విభాగాల అధికారులు బదిలీ అయ్యారు. పట్టణ ప్రణాళిక విభాగంలో డిప్యూటీ సిటీ ప్లానర్‌గా ఉన్న వెంకటరమణను బదిలీ చేసి ఆయన స్థానంలో గ్రేటర్ విశాఖ నగరపాలక సంస్థలో ఉన్న పద్మజను నియమించారు. ఇదే విభాగంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా వేణుని మళ్లీ నెల్లూరుకు బదిలీ చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో ఎస్ఈ సంపత్‌కుమార్ గ్రేటర్ విశాఖకు ఎస్ఈగా బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో విజయవాడలో ఎస్ఈగా ఉన్న కె.రామ్మోహన్‌రావుని నియమించారు. ఈఈగా ఉన్న సంజయ్ శ్రీనివాస్ ఒంగోలు పబ్లిక్ హెల్త్ ఈఈగా బదిలీ అయ్యారు. ఎన్ఎంసీ ఈఈ చంద్రయ్య ఒంగోలు నగరపాలక సంస్థ ఈఈగా నియమితులయ్యారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో ఈఈగా ఉన్న శేషగిరిరావును ఎన్ఎంసీ ఈఈగా నియమించారు. నుడా కార్యదర్శిగా ఉన్న శ్రీలక్ష్మిని ఎన్ఎంసీ కౌన్సిల్ కార్యదర్శిగా బదిలీ చేశారు. ఎన్ఎంసీ సూపరింటెండెంట్‌గా ఉన్న నాగేశ్వరరావును రాజంపేట మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. కౌన్సిల్ కార్యదర్శిగా నియమితులైన ఫజరుల్లాను నాలుగు రోజులకే నాయుడుపేట మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేయడం జరిగింది.

హౌసింగ్‌లో..

నెల్లూరు(అర్బన్): జిల్లా హౌసింగ్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పలువురు ఇంజినీర్లను ఆ శాఖ ఉన్నతాధికారులు సోమవారం బదిలీ చేశారు. గుంటూరు జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో పనిచేస్తున్న డీహెచ్‌హెచ్ఎస్ ఇంజినీర్‌ను నెల్లూరు హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ చేశారు. నంద్యాల జిల్లాలో ఈఈగా ఉన్న శ్రీహరిగోపాల్ కందుకూరు ఈఈగా నియమితులయ్యారు. తిరుపతి జిల్లా వెంకటగిరిలో డీఈఈగా ఉన్న ఎండీ జహీరుద్దీన్‌ను సర్వేపల్లి సబ్ డివిజన్‌కు మార్చారు. ఒంగోలులో డీఈఈగా పని చేస్తున్న పీవీ నారాయణను కందుకూరు డీఈఈగా, నెల్లూరు హెడ్ ఆఫీస్‌లో జిల్లా మేనేజర్‌గా పని చేస్తున్న సరోజినీని విజయవాడ హెడ్ ఆఫీసుకు బదిలీ చేశారు.

అటవీ శాఖలో..

జిల్లా అటవీశాఖలో పనిచేస్తున్న పలువురు అధికారులను బదిలీ చేస్తూ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి వై.శ్రీనివాసరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మర్రిపాడు సోషల్ ఫారెస్ట్ సెక్షన్ పరిధిలో ఆత్మకూరు రేంజ్‌లో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న జీఎస్ఎల్ సౌజన్యను నెల్లూరు ఫారెస్ట్ సెటిల్‌మెంట్ కార్యాలయానికి బదిలీ చేశారు. దుత్తలూరు సెక్షన్ ఉదయగిరి రేంజ్ పరిధిలో డిప్యూటీ రేంజర్ టి.శ్రీనివాసులును అనంతసాగరం సెక్షన్-ఆత్మకూరు రేంజ్‌కు, ఒంగోలు సెక్షన్‌లో పని చేస్తున్న డిప్యూటీ రేంజర్ ఎం.ప్రత్యూషను మర్రిపాడు సెక్షన్ - ఆత్మకూరు రేంజ్‌కు, పలువురు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లను, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లను, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లను, ఆఫీస్ సబార్డినేటర్లను బదిలీ చేశారు.

ఏపీఎస్పీడీసీఎల్లో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్లో విధులు నిర్వహిస్తున్న 17 మంది డీఈఈలు బదిలీ అయ్యారు. పి.శీనయ్య బుచ్చిరెడ్డిపాళెం నుంచి కావలికి, సీహెచ్ సతీష్ కోవూరు నుంచి బుచ్చిరెడ్డిపాళేనికి, కె.మధుసూదనరెడ్డి రామూర్తినగర్ నెల్లూరు నుంచి కోవూరుకు, ఎన్.సునీల్‌కుమార్ ఇందుకూరుపేట నుంచి రామూర్తినగర్‌కు, జి.పరిశుద్ధరావు శ్రీకాళహస్తి నుంచి డీపీఈ నెల్లూరుకు, ఎ.అశోక్ ముత్తుకూరు నుంచి ఏకే నగర్‌కు, జె.రాము నెల్లూరు హెటీ మీటర్స్ నుంచి ముత్తుకూరుకు, ఎస్‌డీ ఖాదర్‌బాషా సూళ్లూరుపేట నుంచి హెచ్‌టీ మీటర్స్ నెల్లూరుకు, ఆర్.శేఖర్ నాయుడుపేట నుంచి సూళ్లూరుపేటకు, కె.వెంకటవరప్రసాద్ కోట నుంచి నాయుడుపేటకు, పి.సుబ్రహ్మణ్యం డీపీఈ నుంచి పొదలకూరుకు, కె.సురేష్‌బాబు నెల్లూరు సర్కిల్ ఆఫీస్ నుంచి డీపీఈ-3కు, బి.సురేంద్రబాబు పొదలకూరు నుంచి ఇందుకూరుపేటకు వి.సుప్రియ తిరుపతి కార్పొరేట్ ఆఫీస్ నుంచి నెల్లూరుకు, ఎ.రవికుమార్ గూడూరు నుంచి కోటకు, బి.చిన్నస్వామినాయక్ పోరుమామిళ్ల నుంచి గూడూరు రూరల్‌కు, జి.మునీంద్ర తిరుపతి కార్పొరేట్ ఆఫీస్ నుంచి నెల్లూరు సర్కిల్ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు.

- కోవూరుకు బదిలీ అయిన మధుసూదనరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దీంతో నెల్లూరు, కోవూరు డివిజన్లకు చెందిన విద్యుత్ అధికారులు, సిబ్బంది ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

సబ్ రిజిస్ట్రార్ల నియామకం

నెల్లూరు సిటీ: జిల్లాలోని 15 స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పదిమంది సబ్ రిజిస్ట్రార్ల నియామకాలు జరిగినట్లు ఆ శాఖ డీఐజీ కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. నెల్లూరు ఆడిట్ సబ్ రిజిస్ట్రార్ రవిజోసెఫ్‌ను అల్లూరుకు, అక్కడ పనిచేస్తున్న ప్రసన్నలక్ష్మిని ముత్తుకూరుకు బదిలీ చేశారు. గుంటూరు ఆడిట్ సీనియర్ అసిస్టెంట్ అమర్‌కు పదోన్నతి కల్పించి రాపూరు సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ కోటేశ్వరమ్మను బుచ్చిరెడ్డిపాళేనికి, సూళ్లూరుపేట సబ్ రిజిస్ట్రార్ సుమలతను కావలికి, బుజబుజనెల్లూరులో పనిచేస్తున్న కోటేశ్వరరావును వింజమూరుకు, మార్కాపురంలో ఉన్న రాధాకృష్ణను స్టోన్‌హౌస్‌పేటకు, గుంటూరు కార్యాలయంలో ఉన్న శ్రీనివాస్‌ను ఆత్మకూరుకు, కోటలో ఉన్న ప్రవీణను బుజబుజ నెల్లూరుకు ప్రకాశం జిల్లా పొదిలిలో పనిచేస్తున్న రామకోటయ్యను కందుకూరు సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. నెల్లూరు ప్రధాన కార్యాలయంలోని 1, 2 సబ్ రిజిస్ట్రార్ల బదిలీలు జరగాల్సి ఉంది. ఇందుకూరుపేట, ఉదయగిరి, పొదలకూరు సబ్ రిజిస్ట్రార్లు వారి స్థానాల్లోనే కొనసాగనున్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



నారాయణకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

నెల్లూరు(బృందావనం): విజయవాడ వరద బాధితులకు నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్, పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ సభ్యులు రూ.1,01,116లను ఆర్థిక సాయం చేశారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణకు నగరంలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం అందజేశారు. అనంతరం దుకాణదారులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొనగళ్ల శోభన్‌బాబు, కార్యదర్శి ఆరవేటి ఫణీంద్ర, కోశాధికారి భోగనాథం సుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శి చందోలు సతీష్‌కుమార్, ఏల్చూరు శ్రీనివాసులు, సురేంద్ర, నగేష్, ఐతా సుబ్బరాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

• వరద బాధితుల కోసం సీఎం సహాయనిధికి రూ.75 వేల చెక్కును కలెక్టర్ ఆనంద్‌కు సోమవారం అందజేసినట్లు సీపీఎఫ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు నారాయణస్వామి, పి.సురేష్, కార్యదర్శి ఎ.పాల్ తెలిపారు. అలాగే తమ అసోసియేషన్ ఆఫీస్ కోసం స్థలం కేటాయించాలని పారామిలిటరీ మాజీ సభ్యులం కోరామని పాల్ వివరించారు.